# ఆనందో బ్రహ్మ



- సాయి బ్రహ్మానందం గొర్తి

నెలనెలా నవ్వుల విరుందు

## తెలుగు వారమండీ...

భారతదేశ రాజధానిలో ఒకసారి ఓ సాంస్కృతిక ఉత్సవం జరుగుతోంది. ఉత్సవంలో దేశంలోని అన్ని రాష్ట్రాలూ పాల్గొన్నాయి. అక్కడ “మీరు - మీ సంస్కృతి‘ అనే పోటీ ( రిపబ్లిక్ డే పెరేడ్ లాంటిదే ) పెట్టారు. . ఈ పోటీలో ఎవరి సంస్కృతిని వారు ఎంతగా ప్రతిబింబిస్తే ఆ రాష్ట్రానికి అయిదు, మూడు, రెండు కోట్ల రూపాయిలు బహుమతులుగా ప్రకటించారు. ప్రతీ సంస్కృతిలో ప్రముఖుల గొప్పతనాన్ని చాటుతూ ప్రదర్శన ఇవ్వాలి. సాంస్కృతిక పోటీ అంటే తమిళనాడు, బెంగాలీలు,, ఒకళ్ళేమిటి దేశంలోని ప్రతీ రాష్ట్రం వారు పాల్గొన్నారు. ఇందులో బెంగాల్ వాళ్ళు రవీంద్రనాథ్ ఠాగోర్‌ని, సుబ్రహ్మణ్య భారతిని తమిళవాళ్ళూ, ఇలా ప్రతీ రాష్ట్రం వారి వారి సంస్కృతిలో ప్రముఖ వ్యక్తుల్ని కొనియాడారు. ఈ పోటీలో తమిళనాడు రాష్ట్రానికి మొదటి, బెంగాల్ రాష్ట్రానికి రెండవ, మహారాష్ట్రకి తృతీయ బహుమతులు లభించాయి. ఈ పోటీలో ఆంధ్ర రాష్ట్రం తరపున ఒక్కరూ పాల్గొనకపోవడం ప్రతీ తెలుగు వాడిని ఆ-శ్చర్యపరచడమే కాకుండా ఆంధ్రప్రభుత్వం మీద కోపం కూడా వచ్చింది.

తెలుగు వారిలో ఒక్క ప్రముఖ వ్యక్తీ లేడా, ఇది సిగ్గుచేటు,

తెలుగు వారి ఆత్మగౌరవానికి తీరని అవమానం అంటూ ప్రజలూ, ప్రతిపక్షాలూ ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. ప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిక విభాగాన్ని ప్రశ్నించి, వారు ఎందుకు పాల్గొనలేదో ఓ కమిటీ వేసారు.

కమిటీ రిపోర్ట్ చూసాక ముఖ్యమంత్రి గారు ఓ ప్రకటన ఇచ్చారు. అది...

“కేంద్ర ప్రభుత్వం చేపట్టిన **మీరు - మీ సంస్కృతి** కి ఒక్క తెలుగు వారు పాల్గొనలేదని, తెలుగువారి ఆత్మగౌరవానికి దెబ్బ తగిలితే క్షమించాలి. మన రాష్ట్రం తరపున ఒక్క ఎంట్రీ లేదన్నది వాస్తవమే...కానీ తెలుగు వారు అంతగా చింతించనవసరం లేదు. ఎందుకంటే ఠాగోర్, సుబ్రహ్మణ్య భారతీ, శివాజీ వేషధారణ చేసి బహుమతులు గెల్చుకొన్న వ్యక్తులు తెలుగు వారేనని గర్వంగా చెబుతున్నాను....“

## నవ్వు  నవ్వు

ప్రేమ : ఆర్ట్ ఆఫ్ లవింగ్

పెళ్ళి : పార్ట్ ఆఫ్ లివింగ్

విడాకులు: అపార్ట్ ఇన్ లివింగ్ అండ్ లవింగ్

## ముందు  వెనుక

జాన్ హెన్రి అనే  ఆయన మొట్ట మొదటి నోబుల్ శాంతి గ్రహీత. అప్పటివరకూ - ఆయన పేరు ఎవరికీ అంతగా తెలీదు. ఎవరికీ తెలియని ఊరూ పేరు లేని వారికి నోబుల్ ప్రైజ్ ఇచ్చారని అందరూ ఆశ్చర్యపోయారు. ఆరాతీస్తే జీన్ హెన్రి ఎవరోకాదు, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రెడ్ క్రాస్ సంస్థ సంస్థాపకుడు.

ఆయన్ని ఓ ఇంటర్వ్యూలో ప్రశ్నించారు..

"అందరికీ రెడ్ క్రాస్ గురించి తెలుసుకానీ, మీ గురించి అంతగా తెలియదు.."

"అవును తెలియకపోవడమే మంచిది. ఎందుకంటే ఏ వ్యక్తీ సంస్థ కంటే ఎక్కువ ప్రచారం పొందితే   సంస్థ ఉద్దేశ్యం పతనావస్థకి చేరుకున్నట్లే.. సంస్థ ముందుండాలి..వ్యకులు వెనక ఉండాలి. అలా ఉంటేనే సంస్థలు పదికాలాల పాటూ నిలబడతాయి. ఈ నోబుల్ శాంతి బహుమతి నాదికాదు. ఈ సంస్థది.. " అని అన్నాడు జాన్ హెన్రి. అందుకే రెడ్ క్రాస్ లాంటి సంస్థలు పదికాలాల పాటూ నిలుస్తాయి.

## విచిత్ర  ప్రకటనలు

మీరు నిరక్షరాస్యులా?

తెలుగు చదవడం, వ్రాయడం రాదా?

అయితే ఈ క్రింది చిరునామాని సంప్రదించండి.

# ఆఖరి  కోరిక

సుబ్బారావుకి రోడ్డు ప్రమాదం జరిగి చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. డాక్టరు ఇహ లాభంలేదని మహా బ్రతికితే ఇంకో వారం అని చెప్పాడు. సుబ్బారావు కి ఓ రోజు స్పృహ వచ్చింది. పక్కనే ఉన్న భార్యతో - “సుశీ! నే మరణించాకా నువ్వు పక్కవీధిలో అప్పారావుని పెళ్ళి చేసుకోవాలి.“

“అవేం మాటలండీ! మీరు లేని జీవితాన్ని ఊహించుకోలేను...మీ స్థానంలో ఇంకో మగాణ్ణి, అందునా అప్పారావు లాంటి వ్యక్తిని ఊహించుకోలేను...“ వెక్కి వెక్కి ఏడ్చింది సుశీల.

“అలాకాదు..సుశీ...ఇది నా ఆఖరి కోరిక - నువ్వు అప్పారావునే పెళ్ళి చేసుకుంటానని మాటివ్వాలి.“ ప్రాధేయ పడ్డాడు

“పెళ్ళి చేసుకుంటాను సరే... అప్పారావుని మాత్రం కాదు...అయినా అప్పారావునే ఎందుకు చేసుకోవాలి?“

“ఎందుకంటే - అప్పారావు మన ఇల్లు అమ్మకంలో నన్ను మోసం చేసాడు..“

ఆఖరిసారిగా ఠక్కున జవాబిచ్చాడు సుబ్బారావు.

## అలవాటు

జయ: మా ఆయన గోళ్ళు కొరికే అలవాటు మానిపించలేక చస్తున్నాను.

విజయ: మావారికీ ఆ పాడు అలవాటుంది. పెళ్ళయ్యాక ఒక్క రోజులో మానిపించేసా?

జయ: అదెలా సాధ్యం?

విజయ: ఏముంది, ముందు పళ్ళు నాలుగూ ఊడ గొట్టా!

# ఉచితం



సినిమా సంగీత ప్రపంచంలో సాలూరి రాజేశ్వర రావుగారిది ప్రత్యేక స్థానం ! ఆయన ఏ పాటకైనా బాణీలు కట్టడంలో చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఓ సారి వాహిని స్టూడియోలో ఓ సినిమా పాటకి బాణీలు కడుతున్నారు. దర్శకుడుకి సాలూరి వారి బాణీలు నచ్చడంలేదు. చివరికి ఎలాగో నచ్చి ఓ బాణీ సరేనన్నారు. ఇంతలో సదరు నిర్మాత గారు వచ్చి ఇంతకు ముందు ఖాయం చేసిన బాణీ బాగోలేదని ఇంకోటి చూడమన్నారు. సరే సాలూరి వారు ఇంకో బాణీ కట్టారు. నిర్మాత గారికి నచ్చింది. ఇంతలో ఓ మహానటుడు వచ్చాడు. ఇంతకుముందు కట్టిన బాణీలు అన్నీ చెత్తగా ఉన్నాయి. ఇంకోటి కట్టమన్నారు. ఈ స్వరం బాగోలేదు, పల్లవి ఇలా పెట్టండి.. చరణం ఇలా ఉండాలి అంటూ ఎవరికితోచినట్లు వారు ఉచిత సలహాలు పారేస్తున్నారు.

అప్పటికే మధ్యాన్నం నాలుగు దాటింది. ఉదయం ఎనిమిదింటికి మొదలెట్టిన రికార్డింగ్ సాయంత్రం నాలుగైనా కాలేదు. రాజేశ్వర రావుగారికి అసహనం పెరిగిపోయింది. ఇంతలో ఓ టీ అబ్బాయి టీ పట్టుకొచ్చాడు. రాజేశ్వరరావుగారు మహా మంట మీదన్నాడు. టీ అబ్బాయిని పిలిచి - "ఒరే నీక్కూడా ఏవైనా సలహాలు ఉంటే చెప్పు.. నాలుగవుతోంది. త్వరగా ట్యూన్ కట్టి ఇంటికెళ్ళాలి" ఇది విన్నాక నిర్మాత, దర్శకుడు, మహానటుడు నోరెత్తితే ఒట్టు.

# అచ్చ  తెల్గు షినెమ

చిత్రం: రాస్కెల్ ( టాగ్ లైను : ప్రేమకు కొలతలు లేవు )

దర్శకుడు: మణివణ్ణన్

హీరో: మెగా పవర్ స్టార్

హీరోయిన్: ఉషా కొఠారి

విలన్ : షాయాజీ షిండే

సంగీతం: రెహమాన్

కథ: రాఘవన్

గాయని గాయకులు: ఉదిత్ నారాయణ్ - శ్రేయఘోషల్ - సోనూ నిగం

మాటలు - పాటలు: డబ్బింగ్ బాస్

స్టంట్స్: అంజుమణి

నృత్యాలు: ఫ్లొరెన్స్ డిసౌజా

ఫరా ఖాన్ ( లవ్ కిక్ సైడ్ కిక్ - సాంగ్)

స్పెషల్ ఎఫెక్ట్స్: సెల్వం

నిర్మాతలు: ఎం ఎన్ రాజు - వీరా రెడ్డి.

ఈ నెలకి ఇహ ఈ డోసు చాలు




వచ్చే నెల చూసుకుందాం